
సాక్షి బాపట్ల


శనివారం । 22 । జూలై । 2023

I



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం శుక్రవారం 517.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,716 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కులు విడుదల చేశారు.



గవర్నర్ పర్యటనకు పక్కా ఏర్పాట్లు

పెనమలూరు: గవర్నర్ అబ్దుల్ నజీర్ గంగూరు పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్ చెప్పారు. శుక్రవారం గంగూరులో ఆమె పర్యటించారు.

న్యూస్‌రీల్

అటవీ భూముల పంపిణీకి సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

నరసరావుపేట: జిల్లాలో రాజుపాలెం, మాచవరం మండలాల పరిధిలో 2005 కన్నా ముందు సాగులో ఉన్న అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. రెండు మండలాల్లో 54 మంది గిరిజనులు 104.26 ఎకరాలను సాగు చేసుకుంటూ వస్తున్నారని, వారికి హక్కు కల్పించేందుకు శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా కమిటీతో సమావేశమయ్యారు. అర్హులైన పేదలందరికీ అవకాశం కల్పించాలని, ప్రపంచ గిరిజన దినోత్సవాన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అటవీశాఖ అధికారి రామచంద్రరావు, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు రాజకుమారి, అద్దయ్య, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యూషన్ సర్టిఫికెట్లకు అధిక ధరలు వసూలు తగదు



పట్నంబజారు : పొల్యూషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసే సమయంలో వాహనదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చార్జీలు మాత్రమే వాహనదారుల నుంచి వసూలు చేయాలన్నారు. ఇప్పటికే పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్లకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ. వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

యార్డులో 25,762 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,914 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,762 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.12,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,354 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అరగంటలోనే దుర్గమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. శుక్రవారం అయినప్పటికీ అధిక శ్రావణం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. భక్తులకు అర్ధగంటలోనే అమ్మవారి దర్శనం పూర్తయింది. ఉదయం నుంచి భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉండగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం కొంత కనిపించింది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ మరో కొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో యువతీ, యువకులు తమకు నచ్చిన కాలేజీలో సీటు రావాలని అమ్మవారిని మొక్కుకున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా 1.30 గంటల వరకు రద్దీ కనిపించింది.

భావపురిలో ప్రగతి దూకుడు

ఊరూ.. వాడా అభివృద్ధి

- మరో రూ.20 కోట్లు నిధులు మంజూరు
- రూ.34.41 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్
- సెప్టెంబర్ 15 నాటికి మిగిలిన పనులు పూర్తి
- పూర్తయిన భవనాలు ఆయా శాఖలకు అప్పగింత

భావపురి భవిష్యత్‌కు దిక్సూచి కానుంది.. అభివృద్ధి పరుగులు పెడుతోంది.. సాధారణంగా ఈ ప్రాంతం ఇసుక భూమి.. సాగునీటి కొరత ఉండేది.. వ్యవసాయ ప్రాంతమే అయినా పూలు, కూరగాయాల సాగు ప్రధానం. సముద్ర తీరప్రాంతం ఉన్నా అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతం. విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి జాడ లేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాగానే ఈ ప్రాంతానికి మంచి రోజులొచ్చాయి. మెడికల్ కాలేజ్ వచ్చింది. నిధులు వరదలా రావడంతో అభివృద్ధి దిశగా పయనిస్తోంది.



ఉపాధి హామీ పనులలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. ఒక వైపు అర్హులందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో వైపు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లతో పాటు పలురకాల పరిపాలనా భవనాలను పెద్ద ఎత్తున నిర్మిస్తోంది. వీటి నిర్మాణ పనులకు సంబంధించి ఇటీవల రూ.34.41 కోట్ల బిల్లులు ప్రభుత్వం చెల్లించింది.

సెప్టెంబర్ 15 నాటికి పనులు..

ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన పనులు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు పనులు వేగవంతం చేశారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బిల్లులను పనులు పూర్తి అయిన 15 రోజుల్లోగా మొత్తం చెల్లించనుంది. అనంతరం పూర్తి అయిన భవనాలను ఆయా ప్రభుత్వ శాఖలకు అప్పగించనున్నారు.

కొత్త భవనాలు సిద్ధం..

ఇప్పటి వరకూ జిల్లాలో 37 గ్రామ సచివాలయాల నిర్మాణం పూర్తి అయింది. ఇంకా 137 సచివాలయాల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. 33 రైతు భరోసా కేంద్రాలు పూర్తి కాగా 77 పూర్తి కావాల్సి ఉంది. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు సంబంధించి ఇప్పటి వరకు 38 పూర్తి కాగా ఇంకా 106 పూర్తి కావాల్సి ఉంది. వివిధ దశల్లో ఉన్న భవన నిర్మాణాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో అభివృద్ధిపై..

మరోవైపు ప్రభుత్వ భవనాలే కాకుండా క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. అందులో భాగంగా మండలానికి సుమారు రూ.60 లక్షల నిధులు కేటాయించింది. తక్షణమే అవసరమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇప్పటికే కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన పనుల ఎంపిక, పనులు మొదలు పెట్టడం, పూర్తి చేయడం తదితర అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, అప్రోచ్‌రోడ్లతో పాటు అత్యవసరం అనుకున్న మిగిలిన పనులు చేపడతారు. గ్రామ సభ ఆమోదంతో ఈ పనులు ఎంపిక చేయనున్నారు. పనులు పూర్తయి రికార్డు చేసిన 15 రోజులలో బిల్లులు ప్రభుత్వం చెల్లించనుంది.

అభివృద్ధి పనులు వేగవంతం



అభివృద్ధి పనులు మరింత వేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వ భవనాలు సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. మరో వైపు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మొదలు పెట్టబోతున్నాం. ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్లు పనులు చేపట్టనున్నాం. పనులన్నీ పూర్తయితే గ్రామాలు మరింత సుందరంగా మారతాయి.

– రంజిత్‌బాషా, జిల్లా కలెక్టర్

పనులు పూర్తికాగానే బిల్లుల చెల్లింపు



జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకూ ఇవ్వాల్సిన రూ.34.41 బిల్లులు చెల్లించాం. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో మిగిలిన పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే మిగిలిన బిల్లులు చెల్లిస్తాం. మండలానికి రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నాం.

–శంకర్‌నాయక్, డ్వామా పీడీ

చేనేతకు ‘నేతన్న నేస్తం’ వరం



భట్టిప్రోలు మండలం ఐలవరంలో చేనేత కార్మికులకు నేతన్న నేస్తం నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, మంత్రి నాగార్జున, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- ఐలవరంలో ‘వైఎస్సార్ నేతన్న నేస్తం’ కార్యక్రమం
- బాపట్ల జిల్లాలో 8,705 మందికి లబ్ధి

ఐలవరం(భట్టిప్రోలు): చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం వరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఐదో విడత నేతన్న నేస్తం జమ బాపట్ల జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేనేత కార్మికుల అభ్యున్నతికి ఎంతగానో పాటు పడ్డారని, ఆయన బాటలోనే తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నల కష్టాలు గుర్తెరిగి నేతన్న నేస్తం కింద ప్రతి ఏటా రూ.24 వేలు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఐదు పర్యాయాలుగా ఐలవరం వాసులకు నేతన్న నేస్తం దశల వారీగా పెరుగుతుండటం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ ఏడాది 576 మందికి రూ.1.38 కోట్లు ఖాతాల్లో జమ అయినట్లు వివరించారు.

నేతన్నల కుటుంబాల్లో వెలుగులు..

రాజ్యసభ్యులు మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ కులవృత్తులపై ఆధారపడి జీవించే సామాజిక వర్గాలలో అతి క్లిష్టమైన పని చేసే నేతన్నల కష్టాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ నేతన్నల కుటుంబాలలో వెలుగులు నింపినట్లు చెప్పారు. వారి ఖాతాల్లో ప్రతి ఏటా దేశంలో ఎక్కడ కూడా ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రూ.24 వేలు జమ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో నేతన్న నేస్తం కింద లబ్ధిదారుల ఖాతాల్లో రూ.100 కోట్లు జమ అయ్యాయని పేర్కొన్నారు. చేనేత జౌళి శాఖాధికారిణి వీరవల్లి వనజ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9,896 మంది లబ్ధిదారుల ఖాతాల్లో 23.75 కోట్లు మేర ప్రయోజనం చేకూరిందని... ఒక్క బాపట్ల జిల్లాలోనే అత్యధికంగా 8,705 మంది లబ్ధిపొందారని తెలిపారు.

తొలుత వెంకటగిరిలో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లైవ్ ప్రోగ్రామ్‌ను చేనేత కార్మికులతో కలసి ప్రజా ప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు వీక్షించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు, చేనేత కార్మికులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా చేనేత జౌళి శాఖాధికారి వీరవల్లి వనజ, రేపల్లె ఆర్డీఓ జె.పార్థసారథి, ఎంపీపీ డి.వెంకట లలిత కుమారి, భట్టిప్రోలు, చెరుకుపల్లి జెడ్పీటీసీ సభ్యులు టి.ఉదయ భాస్కరి, ఎం.పావని, మాజీ ఎంపీపీ ఎం.హేమసుందరరావు, సర్పంచి ఎం.కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కె.పిచ్చయ్య శాస్త్రి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, గట్టు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. తులసీ రంగయ్య, పి.ప్రసాద్, జె.శరత్, కె. నాగేంద్రబాబు, బి.బసవయ్య పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



ఏఆర్ సిబ్బంది కవాతును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: ఏఆర్ విభాగం పోలీస్ శాఖకు వెన్నుముఖ అని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ శాఖలోని ఏఆర్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ దర్బార్ శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ఏఆర్ విభాగంలో పనిచేసే పోలీసు సిబ్బంది క్రమశిక్షణకు మారు పేరుగా ఉండాలని చెప్పారు. త్వరలో జరగనున్న ఆగస్టు 15 కవాతు విజయవంతంగా చేయటానికి ఇప్పటి నుంచే కసరత్తు చేయాలని కోరారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అల్పాహార క్యాంటీన్ సిద్ధం అవుతుందని, వెల్ఫేర్ క్యాంటీన్ కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వ్యక్తిగతంగా సిబ్బందికి ఉన్న సమస్యలను కూడా గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలను కట్టాలని, గతంలో కడుతున్న వారు కూడా రెన్యువల్ అవుతుందో లేదో చూసుకోవాలని సూచించారు. ‘దర్బార్’ కార్యక్రమంలో ఎంత కాలంగానో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డిఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బి సీఐ ఎ. శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు పాల్గొన్నారు.

గ్రానైట్ ఎగుమతులకు పర్మిట్ తప్పనిసరి

జిల్లా మైన్స్ ఏడీ రాజేష్‌కుమార్



క్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న మైన్స్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ: గ్రానైట్ క్వారీల నుంచి ముడి, మీటరు రాళ్లు, పర్మిట్, బిల్లులతోనే ఎగుమతులు చేపట్టాలని బాపట్ల జిల్లా మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రాజేష్ కుమార్ పేర్కొన్నారు. బల్లికురవ మండలంలోని ఈర్లకొండ వద్ద క్వారీ నిరాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్మిట్ లేకుండా క్వారీల నుంచి రాళ్లు తరలిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా చర్యలు నిబంధనలతో పాటు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్మికులకు ఎప్పటికప్పుడు వొకేషనల్ శిక్షణతోపాటు పనులు చేసేటప్పుడు విధిగా హెల్మెట్ బూట్లు, కళ్లజోడు ధరించేలా చూడాల్సి బాధ్యత మేనేజర్, మేట్లపై ఉందని చెప్పారు. ఆరు నెలలకొకసారి కార్మికులకు వైద్య పరీక్షలు చేయించాలని, ప్రతి రోజు క్వారీ పరిసరాలు రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలని సూచించారు. క్వారీలోని డంపర్లకు రోడ్లపై తిరిగేందుకు అనుమతులు లేవని డంపర్లను క్వారీలోనే పనులకు వినియోగించుకోవాలని ఏడీ ఆదేశించారు. సమావేశంలో ఏజీ ఫణికుమార్, ఆర్ఐ రాజు, కలర్ గ్రానైట్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటక తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్ మృతి



మృతి చెందిన పాణీరావు

చీరాల రూరల్: అంతర్జాతీయ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ అంపైర్‌గా పనిచేసిన కే పాణీరావు(70) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పాణీరావు బ్యాడ్మింటన్‌కు చీరాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. అనంతరం ఆయన రిఫరీగా, అంపైర్‌గా రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష సేవలందించారు. గత కొంతకాలంగా ఆయన హైదరాబాద్‌లోనే నివాసముంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ట్రెజరర్‌గా కొనసాగుతున్నారు. వయస్సు మీదపడడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయన భారతీయ స్టేట్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యారు. పాణీరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాణీరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు డాక్టర్ కె.రమేష్, ఎం.నాంచార రావు, సీహెచ్ నాగేశ్వరరావు, ఐటీబీ మూర్తి, ఎస్‌కే షాహిద్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు



కారులో నుంచి మృతదేహాలను తీస్తున్న పోలీసులు

మార్టూరు: ఆగి ఉన్న లారీని కారు ఢీ కొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని కోనంకి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వస్తున్న పాల ట్యాంకర్ పంక్చర్ కావడంతో రోడ్డు మార్జిన్‌లో ఆపారు. అదే సమయంలో బొల్లాపల్లి టోల్‌గేట్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టి లారీ అడుగు భాగంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నారు. కారులో డేగరముడి గ్రామానికి చెందిన కొండపల్లి శివశంకర్(43), కే రాజుపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని రామకృష్ణ(40), కోనంకి గ్రామానికి చెందిన వీరవల్లి వెంకట్రావు(60) అనే వ్యక్తులు ప్రమాద స్థలంలోనే మరణించారు. ద్వారకపాడు గ్రామానికి చెందిన వెలగా అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు.

శ్రమించిన పోలీసులు..

ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ షేక్ టీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ షేక్ సైదాలు మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీయటానికి తీవ్రంగా శ్రమించారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అనిల్ తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో వీరవల్లి వెంకట్రావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇందులో కొండపల్లి శివశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరవల్లి వెంకట్రావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నల్లపనేని రామకృష్ణకు భార్యపిల్లలు లేరు. తీవ్ర గాయాలపాలైన అనిల్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. వీరవల్లి వెంకట్రావుకు అనిల్ మేనల్లుడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు క్రేన్‌ల సాయంతో వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ప్రమాద తీరును స్థానికులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మృతదేహాలను ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు.



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు



బంధువుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జిందాల్



గాయపడిన అనిల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐ

ఎస్ఐ పరీక్షల సన్నద్ధ అభ్యర్థి గుండెపోటులో మృతి

కాకినాడ క్రైం: ఎస్ఐ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 24 ఏళ్ల యువకుడు గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా పావులూరు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్యామ్, కొద్ది నెలల క్రితం కాకినాడలోని ఓ శిక్షణ కేంద్రంలో ఎస్ఐ పోటీ పరీక్షల శిక్షణ కోసం చేరాడు. కొద్ది రోజుల క్రితం నుంచి తన సీనియర్లతో కలసి అశోక్‌నగర్‌లో ఓ గదిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్యామ్ గురువారం రాత్రి రూం బయట నిద్రపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున గదిలోకి వచ్చి తన సీనియర్ ఉదయ్‌తో తనకు గుండెల్లో అసాధారణంగా ఉందని చెప్పాడు. ఉదయ్ తక్షణమే స్పందించి ద్విచక్రవాహనంపై కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లి చేర్చాడు. వైద్యులు పరీక్షించి ఈసీజీలో సమస్య ఉందని గుర్తించి పరీక్షలకు సిఫార్సు చేశారు. వైద్యులు వార్డులో చేరాలని సిఫార్సు చేశారు. పడకల కొరత కారణంగా పడకకు ఇద్దరు చొప్పున ఉన్నారని తన వల్ల కాదని రూంకి వెళ్లిపోయాడు. మళ్లీ నొప్పిరావడంతో ఆటోలో జీజీహెచ్‌కు తరలించారు. శ్యామ్‌ను పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలో మృతి చెందాడని నిర్ధారించారు. బాపట్ల నుంచి శ్యామ్ తల్లిదండ్రులు శుక్రవారం కాకినాడకు చేరకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి మృతిపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు వెల్లడి



మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానుయేలు

మాచర్ల: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు చెప్పారు. శుక్రవారం పల్నాడు జిల్లా మాచర్లలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. చట్టపరంగా వినియోగదారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు స్వతంత్రంగా ఈ సీజీఆర్ఎఫ్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుదూర ప్రాంతాలనూ సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారుల ద్వారా పరిష్కరించుకోలేని సమస్యలను వారి ముందే సమన్వయంతో చక్కదిద్దే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్వతంత్రంగా తమ కమిటీ చట్టపరిధిలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కమిటీ సాంకేతిక సభ్యులు వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యులు రాందాస్, స్వతంత్ర సభ్యులు సునీత, గుంటూరు ఆపరేషన్ ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- రత్నాల చెరువులో ఘటన
- ఇద్దరు యువకులపై కేసు నమోదు

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి లోని రత్నాలచెరువు ప్రాంతంలో 11 సంవత్సరాల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ బి.అంకమ్మరావు కథనం ప్రకారం .. రత్నాలచెరువులో ఓ బాలిక ఒంటరిగా ఉండగా ఇద్దరు యువకులు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారు. అత్యాచారం చేసిన యువకులు ఇద్దరు బాలికతో తల్లితండ్రులను పోలీసులకు చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడిన బాలిక కుటుంబసభ్యులు ఎవరికి చెప్పలేదు. శుక్రవారం ఉదయం బాలిక తల్లితండ్రులు పనికి వెళ్లిన అనంతరం ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి తెగబడ్డారు. తల్లితండ్రులు వచ్చే సరికి బాలిక నీరసం, జ్వరంతో ఉండడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లగా బాలిక అత్యాచారానికి గురైనట్లు డాక్టర్ గుర్తించారు. దీంతో బాలిక జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. ఈ విషయమై శుక్రవారం రాత్రి బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు ఆరంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర్ రత్న ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.పావని పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి, కలెక్టర్ రంజిత్ బాషా



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జేసీ

జగనన్న సురక్షతో అర్హులకు మేలు

జేసీ చెరుకూరి శ్రీధర్

పర్చూరు(చినగంజాం): జగనన్న సురక్ష కార్యక్రమంలో దేశంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే అందిస్తున్న వినూత్న కార్యక్రమం, అర్హులకు ఎంతో మేలు అని జిల్లా జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవరపల్లి, కొల్లావారిపాలెంలో గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులకు వెంటనే కౌలు రైతు కార్డులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు 811 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే సంధ్యశ్రీ, ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్, ఈఓఆర్డీ గౌస్, సర్పంచి లాజర్, ఉపసర్పంచి తోకల కృష్ణ మోహన్, జేసీఎస్ కన్వీనర్ ఎం.రాఘవ పాల్గొన్నారు.

'యశస్వి' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

బాపట్ల అర్బన్: ప్రధాన మంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత శాఖ ఉప సంచాలకులు డి.కల్పన తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, సంచార జాతులకు చెందిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు ఉండాలన్నారు. ఆన్‌లైన్ హెచ్‌టీటీపీఎస్://వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10 చివరి తేదీగా వెల్లడించారు. ప్రతిభ ఆధారంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 2023 సెప్టెంబర్ 29న నిర్వహించే ప్రధాన మంత్రి యశస్వి పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.

యువత నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

- ఆర్డీఓ గంధం రవీందర్
- జాబ్‌మేళాకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్

పిట్టలవానిపాలెం: యువత నైపుణ్యాలను మెరుగు పరుచుకుని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ గంధం రవీందర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఉద్యోగం పొందిన వారు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. బాపట్ల జిల్లా పరిధిలోని పలు గ్రామాల నుంచి సుమారు 310 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మొత్తం 17 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 96 మందిని ఉద్యోగాలను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. మరో 70 మందిని రెండో విడత ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

మలేరియా యూనిట్ జిల్లా అధికారి రాజ్‌కుమార్



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా శాఖ సిబ్బంది

రేపల్లె: ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని మలేరియా యూనిట్ జిల్లా అధికారి వై.రాజ్ కుమార్ అన్నారు. మలేరియా వ్యాధి, సీజనల్ వ్యాధులపై పట్టణంలోని వెలగపూడివారివీధిలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా ప్రజలు గమనిస్తూ ఉండాలని కోరారు. నీటి నిల్వలు, తేమ వాతావరణం ఉన్న ప్రాంతాలలో దోమల ఉత్పత్తి పెరిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వారంలో ప్రతి ఒక్కరూ ఒక రోజు డ్రైడేగా పాటిస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుందని చెప్పారు. వ్యాధుల బారిన పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కోరారు. వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రజలకు మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా వార్డుల్లో మురుగు కాల్వలలో దోమల నివారణ చేసే మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య, ఏఎన్‌ఎం అనిత పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

గుంటూరు లీగల్: అప్పు డబ్బు వివాద నేపథ్యంలో జరిగిన హత్యాయత్నం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమాన విధిస్తూ నాలుగో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.కుముదిని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. గడ్డం సుజాత తన భర్తతో కలిసి గుంటూరు అమరావతి రోడ్డులోని ఆంజనేయ పేటలో నివాసం ఉంటుంది. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం కాగా ఇద్దరికీ వివాహం చేశారు. సుజాత తన అన్నయ్య కుమారుడు మున్నంగి రమేష్‌రెడ్డికి పదేళ్ల క్రితం యాభై వేలు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి ఇమ్మని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. రమేష్‌రెడ్డి తనకున్న ఆస్తులు మొత్తం అమ్ముకున్నాడు. సుజాత అప్పు మాత్రం తీర్చలేదు. దీంతో సుజాత గట్టిగా ప్రశ్నించగా డబ్బులు ఇవ్వనని రమేష్‌రెడ్డి తేల్చి చెప్పాడు. సుజాత చెల్లెలు కుమారుడు వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి మందు తాగుతూ స్నేహంగా ఉంటారు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 25న సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి వెళ్లి రమేష్‌రెడ్డి డబ్బులు ఇవ్వడని, ఏమి చేసుకుంటారో చేసుకోమని చెప్పాడు. ఆ సమయంలో సుజాత ఇంట్లో ఉన్న ఆమె కుమారుడు నరసింహా రెడ్డికి, సాంబిరెడ్డికి వివాదం జరిగింది. దీంతో సుజాత ఇద్దరినీ చెరొక దెబ్బ కొట్టి అక్కడ నుంచి పంపించేసింది. ఈ వివాద నేపథ్యంలో 2018 ఏప్రిల్ 26న రాత్రి పది గంటల సమయంలో సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి వెళ్లారు. శంకరరెడ్డి కత్తితో విచక్షణారహితంగా సుజాతను పొడిచాడు. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీనిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణకు ముందే సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి మృతి చెందారు. శంకరరెడ్డిపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఆకుల జ్యోష్న్న కేసు వాదించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కోర్టు కానిస్టేబుల్ కె.శివనాగేశ్వరరావు సహకరించారు.

బాలుడి అపహరణ కేసులో దంపతులకు జైలు

దుర్గి: నిదానంపాటి అమ్మవారి ఆలయం సమీపంలో 2016లో జరిగిన బాలుడి అపహరణ కేసుకు సంబంధించి దంపతులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ మాచర్ల ఏజేసీజే మేజిస్ట్రేట్ ఎస్.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పుల్లల చెరువుకు చెందిన యరదేసి రామాంజీ కుటుంబ సభ్యులు అడిగొప్పులలోని నిదానంపాటి అమ్మవారి ఆలయంలో వారి కుమారుడు ఆరు నెలల అరవిందు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బాబును అపహరించారు. వెంటనే బాధితులు దుర్గి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ సుబ్బారావు 48గంటల్లో బాలుడి ఆచూకీని గుర్తించి నిందితులను అరెస్టు చేశారు. బాబును అపహరించిన కేసులో నిందితులుగా గుర్తించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన మేదర సుబ్బారావు, లక్ష్మి దంపతులపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావటంతో మేజిస్ట్రేట్ పై విధంగా తీర్పు ఇచ్చారు. మాచర్ల ఏపీపీ రవీంద్రకుమార్ కోర్టులో వాదించారు. కానిస్టేబుల్ ఇ వెంకయ్య తగిన సహాయ సహకారాలందించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జరగాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన పరిశీలన కార్యక్రమం క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ అధికారులు, మండల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలతో కలసి నియోజకవర్గాలు, మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్తగా వస్తున్న యువ ఓటర్ల దరఖాస్తులో ఉన్న లోపాలు, ఓటర్ల తొలగింపు అంశంపై కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. నియోజకవర్గాలలో రాజకీయపార్టీల అంశాలను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పుడు ఓటర్ల జాబితా నమోదు కోసం, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపు కోసం ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలన చేయాలన్నారు. ఫామ్-6 దరఖాస్తుల వలన అధిక సంఖ్యలో వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని ఎవరైనా కావాలని రాజకీయ స్వలాభం కోసం తప్పుడు ఓటర్ల జాబితా ఇస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అధికారులంతా భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చీరాల- బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య అందించిన వివరాలు.. ఈపురుపాలెం బాలికల హైస్కూల్ సమీపంలో డౌన్‌లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ పరిశీలించాడు. మృతుడికి 50 సంవత్సరాల వయసు ఉంటుందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేగ జ్యూయలర్స్ ఆషాఢం లక్కీ డ్రా విజేతలు వీరే!

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వేగ జ్యూయలర్స్‌లో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాకు విశేష ఆదరణ లభించిందని వేగ జ్యూయలర్స్ యజమానులు వనమా నవీన్, వనమా సుధాకర్ చెప్పారు. వారు శుక్రవారం సాయంత్రం తమ షోరూమ్‌లో ఖాతాదారుల సమక్షంలో లక్కీడ్రా తీశారు. విజయవాడకు చెందిన ఉమారాణి, హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరి, విజయవాడకు చెందిన నాగలక్ష్మి మూడు డైమండ్ నెక్లెస్‌లను లక్కీ డ్రాలో గెలుచుకున్నారని చెప్పారు. త్వరలో అమెరికాలో కూడా తమ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వ్యాన్‌ను ఢీకొని.. పొలాల్లోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు



రోడ్డు పక్కకు జారిన వ్యాన్, బస్సు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు వ్యాన్‌ను ఢీకొని ఆర్టీసీ బస్సు రోడ్డు మార్జిన్‌లోని పొలాల్లోకి వెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని రేపూడి గ్రామశివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హిందుపురం నియోజకవర్గం మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ వెళుతోంది. నంద్యాల నుంచి బట్టల లోడుతో విజయవాడ వెళుతున్న వ్యాన్‌కు మండలంలోని రేపూడి గ్రామశివారులో ఎదురుగా ఆటో రావడంతో షడన్ బ్రేకు వేసి రోడ్డు పక్కకు వచ్చాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొని రోడ్డు పక్కగా ఉన్న పొలాల్లోకి జారిపోయింది. సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు బస్సు డ్రైవర్లు పాపయ్య, నాగరాజులకు ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. వ్యాను డ్రైవర్‌కు ఏ ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు బస్సులోని ప్రయాణికులను అటుగా వస్తున్న మరో బస్సులో విజయవాడకు పంపించి వేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

స్పందన వరకు రానీయకండి

- సమస్యను స్థానికంగా పరిష్కరించండి
- కలెక్టర్ వేణుగోపాలరెడ్డి
- ఉద్యోగుల స్పందన కార్యక్రమం



కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు వెస్ట్: ఉద్యోగులు స్పందనకు రాకుండానే వారి న్యాయమైన సమస్యలను ఆయా శాఖల జిల్లా అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమం పునర్‌ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడవ శుక్రవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యోగులు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వస్తే సత్వర పరిష్కారం ఉంటుందని చెప్పారు. ఏపీఎస్ ఆర్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో మన జిల్లాలోనే ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారన్నారు. దానిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. అనంతరం వచ్చిన 48 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు

స్వీకరించిన జిల్లా కలెక్టర్



కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఉద్యోగుల అభిప్రాయాలను వింటున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. దీనికి జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు మొత్తం 60 మంది తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీలను అందజేశారు. ప్రతి ఉద్యోగితో కూలంకుషంగా చర్చించి తగు పరిష్కారాల కోసం సంబంధిత మండల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖాధిపతులకు అందజేశారు. వచ్చిన అర్జీలలో సచివాలయ సిబ్బంది బదిలీలు, శాఖాపరమైన సమస్యలు వంటివి ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పీటీడీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు అందాయని ప్రజా రవాణా జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

లంక భూములను పరిశీలించిన పల్నాడు జేసీ



అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవెన్యూ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ లంక భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు లీజు పత్రాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ పత్రాలతో ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా, పంట నష్టం, బ్యాంక్ రుణం వంటి సౌకర్యాలు పొందడానికి వీలవుతుందన్నారు. వైకుంఠపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీసర్వే చేస్తున్నామన్నారు. ఈ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు కొత్త పట్టదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.